# పిల్లలు-బొమ్మలు

పిల్లల కథల సంపుటి



రాధ మండువ



# విషయ సూచిక


ముందుమాట

ఆవకాయ మంత్రం ... 1

కోతి ...7

కోతిపుండు    బ్రహ్మరాక్షసి ...11

గెలిచిన గాలిపటం ...14

తెలివి బలం ...19

దయ ...23

దయ్యం డ్రాయర్ ...27

దొంగల ముఠా ...31

నాకు ...35

నిజాయితీ ...39

పనిమంతురాలు ...42

పారిన ఉపాయం ...46

పిల్లలు    బొమ్మలు ...50

పెద్దపులి బద్దకం ...54

భలే కోడలు...58

మారిని శివునాజ్ఞ ...62

రంగయ్యకథ ...66

రాజు మాంత్రికుడు ...69

రాము చేసిన తప్పు ...74

వ్యక్తిత్వం ...78

షికారులో నంబర్లు ...81

సంగీతము ...85

సబ్బు బిళ్ళ ...88

సహాయం...92

వలస..96

ఏం తింటారు..98

# ముందుమాట

కొత్తపల్లి పత్రికలో పిల్లలు రాసిన కథలు ఉంటాయి; పిల్లలకోసం పెద్దవాళ్లు రాసిన కథలు ఉంటాయి.

పత్రిక ప్రతి ఒకటి, ఎవరి ద్వారానో, రాధ మండువ గారికి చేరింది.

వాళ్ల బళ్లో పిల్లలకు తెలుగు నేర్పేందుకు వీటిని సాధనాలుగా వాడుకున్నారు రాధగారు. పిల్లల చేత కథలు రాయించి ప్రచురణ కోసం కొత్తపల్లికి పంపటమే కాకుండా, వాళ్ళకు స్ఫూర్తిగా ఉంటుందని, తనూ సొంతగా కథలు రాయటం మొదలు పెట్టారు. మెల్లగా 'కథా రచయిత్రి' అయిపోయారు! 'ఆవిడ రచనా ప్రస్థానంలో మేమూ కొంచెం పాలుపంచుకున్నాం' అని చెప్పుకోవటం బాగుంది!

ఆవిడ కలంనుండి వెలువడి, కొత్తపల్లి పత్రిక వివిధ సంచికల ద్వారా మందికి పరిచయమైన ఈ కథల సంపుటిని, ఇలా మీ ముందుకు తెస్తున్నందుకు సంతోషంగా ఉంది.

ఈ పుస్తకంలో ఉన్న బొమ్మలన్నీ జెయన్‌టీయూ ఫైన్ ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు గీసినవి. వాళ్ళందరికీ- ముఖ్యంగా సి.రాము, వీరాంజిలకు- కృతజ్ఞతలు.

కథలు ఎలా ఉంటాయో చెప్పాలట- బాగుంటై!!

-అయినా తినబోతూ రుచి అడగటం ఎందుకు, కథలు చదివెయ్యండి, త్వరగా.

- నారాయణ

సంపాదకుడు,

కొత్తపల్లి.



# ఆవకాయ మంత్రం

రచన: శ్రీమతి రాధ మండువ

భవానీపురంలో పెద్ద చెరువు ఒకటి ఉండేది. దాని గట్టు ప్రక్కనే ఒక పాత పెంకుటిల్లు ఉండేది. ఆ పెంకుటింట్లో శివయ్య, పార్వతమ్మ అనే దంపతులు ఉండేవాళ్ళు. వాళ్ళకు ఇద్దరు పిల్లలు: రవి, శైలజ. పార్వతమ్మ రకరకాల ఊరగాయ పచ్చళ్ళు తయారు చేసేది. శివయ్య తమకున్న రెండు ఆవులనూ మేపుకుని ఇంటికి వచ్చాక, భార్య తయారు చేసిన పచ్చళ్ళను పట్నానికి తీసుకుపోయి, అక్కడ అంగళ్ళ వాళ్ళకి అమ్మేవాడు. ఇలా ఆ భార్యాభర్తలిద్దరూ కలసికట్టుగా సంసారాన్ని లాక్కొస్తున్నారు.

ఆ సంవత్సరం రవి పదో తరగతికి వచ్చాడు. పచ్చళ్ళకోసమని పార్వతమ్మ ఇంట్లో ఎప్పుడూ దంచుతూ ఉండేది గదా, ఆ దంపుళ్ళ వల్ల ఇల్లంతా ఎప్పుడూ ఏవో

ఘాటు వాసనలు ఉండేవి. ఆ వాసనల మధ్య చదువుకునేదెలాగ? అందుకని రవి తను ప్రశాంతంగా కూర్చొని చదువుకునేందుకు తగిన స్థలం ఒకటి వెతుక్కున్నాడు.

చెరువు గట్టునే, ఊరికి కొంచెం దూరంగా, పాత మిద్దె ఒకటి ఉండేది. అది ఒక సైనికుడి ఇల్లు. ఎప్పుడో జరిగిన యుద్ధంలో పాపం, ఆ సైనికుడు చనిపోయాడు. ఆ వార్త వినగానే అతని భార్య కాస్తా గుండె ఆగి మరణించింది.



దీనికంతటికీ కారణం ఆ ఇల్లే అని ఊళ్ళో వాళ్ళు చెప్పుకునేవాళ్ళు. చీకటి పడిందంటే ఆ మిద్దె ఛాయలకు కూడా ఎవ్వరూ వెళ్ళరు. కానీ రవికి ఏం భయం? తను ఆ భవంతి వసారాని శుభ్రం చేసుకున్నాడు. పగలంతా అక్కడే వరండాలో కూర్చుని చదువుకునేవాడు. చీకటి పడకముందే మెల్లగా ఇల్లు చేరుకునేవాడు.

ఇలా ఉండగా ఒకసారి బంగాళాఖాతంలో వాయుగుండం ఏర్పడింది. జోరున వర్షం కురవసాగింది. సాయంత్రం ఆరు గంటలకే చీకట్లు ముసురుకున్నాయి. పిల్లలందరూ భోజనాలు చేసేసి పడుకున్నారు. అనుకున్నట్లుగానే "చెరువు పొంగేట్లుంది! అందరూ ప్రెసిడెంట్ గారి చావిడికి వెళ్ళాలని హెచ్చరిక చేస్తున్నారహో!" అని దండోరా వేయించారు పంచాయితీ వాళ్ళు. దాంతో గ్రామం లోతట్టు ప్రాంతంలో ఉన్న వాళ్ళందరూ గోలగోలగా అరుచుకుంటూ తట్టా, బుట్టా సర్దుకుని చావిడి వైపు పరిగెత్తటం మొదలుపెట్టారు.

శివయ్య కుటుంబం కూడా విలువైన వస్తువులను మూట కట్టుకుని చావిడిలోకి చేరింది. అందరూ గజగజలాడుతూ రాత్రిని

అక్కడే గడిపారు. మర్నాడు మధ్యాహ్నానికిగానీ వాన తెరిపినివ్వలేదు. 'ఊళ్ళో నీరు తీయడానికి మరో రెండు రోజులు పట్టొచ్చు ' అనుకుంటూ అందరూ ఇంటికి బయలుదేరారు. తీరా చూస్తే అక్కడ శివయ్య వాళ్ళ ఇల్లు వరద నీటికి నాని, పూర్తిగా కుప్ప కూలిపోయి ఉన్నది!

శివయ్య, పార్వతమ్మ అక్కడే కూర్చుని ఏడవటం మొదలు పెట్టారు. శైలజ బిత్తరచూపులు చూస్తూ నిలబడింది. ముందుగా తేరుకున్న రవి జరగవలసిన దాన్ని గురించి ఆలోచించాడు. ముగ్గురికీ ధైర్యం చెప్పాడు. కుటుంబం మొత్తాన్నీ సైనికుడి మిద్దెకి తీసుకువెళ్ళాడు. తుఫాను వచ్చి వెలిసినా, వసారా ఇంకా శుభ్రంగానే ఉన్నది. తల్లిదండ్రులను వరండాలో కూర్చోబెట్టి రవి, శైలజలు ఆ ఇంటి తాళం పగలగొట్టి లోపలికి వెళ్ళారు. శైలజకు కొంచెం భయంగా ఉన్నా, అన్న చెప్పినట్లు విన్నది. ఇద్దరూ గబగబా ఇంటిని శుభ్రం చేశారు. నసుగుతూ, భయపడుతూ, వద్దువద్దంటూ, చేసేదేమీలేక లోపలకు వచ్చింది పార్వతమ్మ. కూలిపోయిన ఇంటికి వెళ్ళి, కొన్ని పాత్రలు, సామాన్లు తెచ్చాడు రవి. శైలజ వంట చేసింది. అందరూ ఏదో తిన్నామనిపించి, త్వరగానే పడుకున్నారు.

అయితే ఆ రాత్రి పార్వతమ్మకి చాలా భయం వేసింది.. చాలాసేపు అసలు నిద్రే పట్టలేదు.. ఇంకా కొంచెం సేపట్లో తెల్లవారుతుందనగా ఆమెకి ఇంటిలోపలినుండి ఏదో గజ్జెల శబ్దం వినబడింది.. రాను రాను ఆ శబ్దం మరింత పెద్దగా అవుతున్నది!! ఆమె గబుక్కున లేచి కూర్చొని వగరుస్తూ "అయ్యో! ఊపిరి ఆడటం లేదు !" అని అరవటం మొదలు పెట్టింది. ఇంటిల్లిపాదీ అదిరిపడి లేచి కూర్చున్నారు. శైలజేమో, భయంతో నాన్న ప్రక్కకి చేరింది. "అదిగో, గజ్జెల శబ్దం! దయ్యం-దయ్యం " అని అరుస్తోంది పార్వతమ్మ. రవి, శివయ్య, శైలజ శ్రద్ధగా విని చూశారు. వాళ్లకు మాత్రం ఏ గజ్జెల శబ్దమూ వినపడలేదు!

అందరూ పార్వతమ్మ ప్రక్కనే చేరారు. ఆమెకి ధైర్యం చెప్పి ఓదార్చసాగారు. వాళ్ళు వేరే ఇంటికి మారే అవకాశం ఇప్పట్లో లేదు. ఎంత కష్టమైనా సరే, అక్కడే సర్దుకోవాలి. పార్వతమ్మకూ ఈ విషయం తెలుసు. అయినా 'దయ్యం' అన్న భయం ఆమె మనసులో తిష్ఠ వేసుకొని ఉన్నది. ఏ ప్రమేయం లేకుండానే ఆమె ఆనాటినుండి ప్రతిరోజూ రాత్రిపూట ఇలాగే అరవటం మొదలు పెట్టింది. అంతేగాక రోజురోజుకీ చిక్కిపోసాగింది!



సైన్సు పాఠాలు శ్రద్ధగా చదివే రవికి తెలుసు- "'గుహల్లోను, పాత మిద్దెల్లోను గాలి కదలిక పెద్దగా ఉండని చోట్ల, గాలిలో ఉండే కార్బన్ డై ఆక్సైడు మొత్తం నేలకు దగ్గరగా పరచుకొని ఉంటుంది. అలాంటి చోట్ల, నేలమీద పడుకుంటే, మనకు కావలసినంత ఆక్సిజన్ అందదు- కొంచెం అసౌకర్యంగా, ఊపిరి ఆడనట్లుగా ఉంటుంది. దానికి భయపడనవసరం లేదు!' అయినా, అమ్మ భ్రాంతికి లోనయ్యింది! 'దయ్యం'అని ఆమెకున్న మూఢనమ్మకానికి మందు ఏది?

ఆలోచించిన మీదట, 'ఈ పిచ్చి నమ్మకాన్ని మరో నమ్మకంతోటే పోగొట్టాలి తప్ప, వేరే మార్గం లేదు' అనిపించింది రవికి. తనకు తట్టిన ఉపాయాన్నొకదాన్ని అతను శైలజకు, శివయ్యకు వివరించాడు. వాళ్ళూ అందుకు ఒప్పుకున్నారు- ఎందుకు ఒప్పుకోరు? "దయ్యం లేదు, గియ్యం లేదు - అది బంగారం లాంటి ఇల్లు" అని వాళ్ళకు తెలిసింది మరి!

ఆ రాత్రి భోజనాలయ్యాక రవి పార్వతమ్మ

వద్దకు చేరి "అమ్మా! దయ్యాలకు ఎర్రటి ఆవకాయ కారం ఎరుపు అంటే భయం కదా?" అని అడిగాడు.

"ఔనురా!" అంది పార్వతమ్మ గుసగుసగా. "ఏమో, ఎవరికేం తెలుసు?" అని మనసులోనే అనుకుంటూ.

"మన ఇంట్లో ఉన్న దయ్యాన్ని వెళ్ళగొడదామమ్మా, ఇవాళ్ల రాత్రి! నువ్వు చేసి పెట్టావుగా, ఆవకాయ పచ్చడి?! అందులో ఇంకొంచెం కారం కలిపి పెట్టు. మరింత ఎర్రగా చెయ్యి. సమయం చూసుకొని నాన్న వెనకనించి దయ్యం జుట్టు పట్టుకుంటాడు. నేనేమో దాని ఒళ్ళంతా ఆవకాయ కారం పట్టిస్తాను. దాంతో అది ఇక వెనక్కి తిరిగి చూడకుండా పారిపోతుంది; బంగారం లాంటి ఈ ఇల్లు మన సొంతమవుతుంది- ఏమంటావు?" అన్నాడు రవి.

ప్రాణం లేచివచ్చినట్లయింది పార్వతమ్మకి. "సరే! అంతకన్నానా! ఇప్పుడే కలుపుతా, కారం!" అంటూ మంచం మీద నుండి ఉత్సాహంగా లేచింది ఆమె. ఆవకాయ జాడీలో మరింత కారం, నూనె కలిపి పెట్టింది.

ఆరోజు అర్థరాత్రి దాటగానే ఆమె యధాప్రకారం "దయ్యం -దయ్యం" అని అరవడం మొదలుపెట్టింది.

"నువ్వు పడుకొనే ఉండమ్మా! -నాన్నా! త్వరగా రా!అదిగో, ఆ దయ్యం జుట్టు పట్టుకో! -చెల్లీ! ఆవకాయ జాడీ పట్టుకురా! ఇదిగో నేను చెబుతా నీపని! హహ్హాహ్హా!" అని హడావుడి చేస్తూ, అరుస్తూ గందరగోళం సృష్టించాడు రవి.

శైలజేమో పథకం ప్రకారం గొంతు మార్చి " అమ్మో! ఎరుపు, అమ్మో! మంట ! కారం -కారం! -నన్ను వదలండి, నేను మీ జోలికి రాను. హా! హా!" అని పెద్దపెట్టున అరిచింది.

"ఫో! ఫో ! మళ్ళీ ఈ చుట్టు ప్రక్కల కనిపించావంటే వదిలేది లేదు!" అంటూ రవి, శివయ్యలు కేకలు వేశారు. కాసేపటికి గొడవ సద్దుమణగ్గానే పార్వతమ్మ భయం భయంగా కళ్ళు తెరిచింది. ఇల్లంతా

ఆవకాయ కారం గుమ్మరించి ఉంది. శైలజ, రవి, శివయ్య, అందరూ ఆవకాయ కారం కొట్టుకొనిపోయి ఉన్నారు. "చూశావా, అమ్మా! నీ ఆవకాయ దెబ్బకి దయ్యం ఎట్లా వదిలి పారిపోయిందో! చెరువులోకి దూకినా మన కారం మంట మాత్రం వదలదు దాన్ని!" అన్నాడు రవి ఇకిలిస్తూ. సంతోషంతో అందరి ముఖాలూ వెలిగిపోతుంటే చూసి తనూ నవ్వేసింది పార్వతమ్మ.

అటుపైన ఆమె లేచి, ఎంతో హుషారుగా ఇల్లంతా శుభ్రం చేసింది. దయ్యం వదిలిన సంతోషం ఆమెలో స్పష్టంగా కనబడింది. ఇక ఏనాడూ ఆమెకు గజ్జెల శబ్దం వినబడనే లేదు! తమ మంత్రం ఫలించిందని రవి, శివయ్య, శైలజ ఒకరినొకరు చూసుకుంటూ నవ్వుకున్నారు.

ఆ ఊర్లో ఉండే పాతతరం వాళ్ళు మటుకు ఇప్పటికీ ఆశ్చర్యపోతుంటారు- "ఆ దయ్యాల కొంపలో వీళ్ళెట్లా ఉంటున్నారు?" అని. వాళ్లకి మరి ఆవకాయ మంత్రం తెలీదుగా?!

---

**నెలలు నిండాయి!**

టీచరు: 'సంవత్సరం అయిపోయింది' - దీన్ని మరో విధంగా చెప్పు, రామూ!

రాము: “నెలలు నిండాయ్‌ సార్!

**తెలివి!**

టీచర్: ఒరేయ్ అశోకుడు రోడ్డుకు ఇరుప్రక్కలా చెట్లు ఎందుకు నాటించాడో చెప్పండిరా!

పిల్లలు: రోడ్డు మధ్యలో నాటిస్తే బళ్ళు, వాహనాలకు అడ్డం కద సార్, అందుకని!



# కోతి

రచన: శ్రీమతి రాధ మండువ

రిషి వనం లో అంజనమ్మ, పవనయ్య అనే రెండు కోతులు ఉండేవి. వాళ్ళకి ముగ్గురు పిల్లలు.

"బిందూ! రేఖా! చక్రీ! ఎక్కడున్నారు? ఇటు రండి" పెద్దగా కేకలు వేసి వాళ్లని పిలిచింది అంజనమ్మ.

"ఏంటమ్మా!" అంటూ వచ్చారు బిందు, రేఖలు.

"చక్రి ఏడి? ఎక్కడకు వెళ్ళాడు? వీడి కాళ్ళు ఒక్కచోట కుదురుగా ఉండవు కదా!" అంది అంజనమ్మ, ప్రక్కనే నిలబడి ఉన్న తన భర్త పవనయ్యను చూస్తూ.



"వాడు పుల్లకు రంధ్రం చేసి, ఆ రంధ్రం గుండా పురుగులను పీల్చుకుని తింటున్నాడమ్మా! అన్నది బిందు.

"పిల్చుకురా, వాడిని ఇటు!" అని కోపంగా అరిచింది అంజనమ్మ.

అమ్మ అరవడం విన్న చక్రి తన చేతిలో ఉన్న పుల్లను చెట్టు వెనక దాచేసి, పరుగెత్తుకుంటూ వచ్చాడు.

"నీకెన్ని సార్లు చెప్పాను, పురుగులను తినొద్దని?! నేను, నాన్న బయటకు వెళుతున్నాం. ఇంట్లోనే బుద్ధిగా ఆడుకోండి. మేం మంచి మంచి పళ్ళు, గ్రుడ్లు తెచ్చి పెడతాం, సరేనా!?" అంది అంజనమ్మ.

"సరేనమ్మా!" అంటూ ముగ్గురూ తలలు ఊపారు.

అంజనమ్మ, పవనయ్య బయటకు వెళ్ళారు. వాళ్ళు అటు వెళ్ళగానే చక్రి బయటికి పరిగెత్తాడు. అక్కలిద్దరికీ చెప్పకుండానే -

"ఒరే! తమ్ముడూ! వెళ్ళొద్దు. అమ్మ తిడుతుంది" అని బిందు అరుస్తున్నా వినిపించుకోలేదు చక్రిగాడు. వాడు చాలా అల్లరి కోతిగాడు కదా! అమ్మ మాటే వినడు. ఇక అక్క మాటేం వింటాడు?

చెట్టు చాటున దాచి పెట్టుకున్న పుల్లను తీసుకుని, పురుగుల కోసం రంధ్రం గుండా చూస్తూ ఆడుతూ, పాడుతూ, గెంతుతూ అడవిలోకి పరుగెత్తాడు చక్రి.

దారిలో వాడికి ఒక చీమల బారు కనిపించింది. "భలే! భలే! చీమలు వరుసగా ఎక్కడికబ్బా, వెళుతున్నాయి?" అంటూ

చీమల బారు వెంట నడుస్తూ నడుస్తూ పోయాడు వాడు. దారి తప్పి గుట్టల్లోకి వెళ్ళిపోయాడు గానీ, అలా దారి తప్పిన సంగతి కూడా తెలియలేదు వాడికి!

కొంతసేపటికి చీమల బారు కనపడకుండా పోవడంతో, మళ్ళీ పురుగుల వేట మొదలుపెట్టాడు. ఇంకొంచెం దూరం పోయేసరికి, అక్కడ పొలాల్లో క్యారెట్లు నాటుకుంటున్న కుందేళ్లు కనబడ్డాయి. దుముకుతూ వెళ్ళిన చక్రిని చూసిన కుందేళ్ళు "ఏయ్! అక్కడే ఆగు. పొలం తొక్కి, పాడు చేస్తావా, ఏమిటి?!" అన్నాయి ఒక్కసారిగా.

"ఎందుకు పాడు చేస్తాను?" అన్నాడు చక్రి మూతి ముడుచుకుని.

అంతలో వాడికొక చెదలపుట్ట కనిపించింది. ఆ పుట్టలో వందల-వేల పురుగులు ఉన్నాయి! వెంటనే వాడు చేతిలో ఉన్న గొట్టాన్ని చకచకా నోట్లో పెట్టుకున్నాడు. పుట్టలో ఉన్న పురుగులను పీల్చుకొని నమలటం మొదలు పెట్టాడు. అయితే ఒక్కసారి గట్టిగా పీల్చేటప్పటికి, పురుగులన్నీ రకాలున వచ్చి, వాడి గొంతుకు అడ్డం పడ్డాయి! ఉక్కిరి బిక్కిరి అయిపోయాడు చక్రి! ఊపిరి ఆడలేదు. ప్రాణం కొట్టుకున్నది నీళ్ళ కోసం. ఇక వాడు అడ్డదిడ్డంగా పరుగెత్తటం మొదలుపెట్టాడు. వాడి కష్టాన్ని చూసి ఒక చిలుక ఎగురుకుంటూ వచ్చింది వాడి దగ్గరికి.

అప్పటికే వాడికి ప్రాణం పోతున్నట్లు ఉంది. చిలుక "నాతో రా!" అని వాడిని చెరువు దగ్గరికి తీసుకెళ్ళింది. ఆత్రంగా నీళ్ళు తాగిన చక్రి, ఆ చెరువు గట్టునే ఓ చెట్టు కింద సోలిపోయాడు. గొంతు బాధ అయితే తగ్గింది కానీ ఇప్పుడు వాడికి విపరీతమైన కడుపు నొప్పి వచ్చింది. ఆ నొప్పిలో వాడికి అమ్మానాన్న గుర్తుకొచ్చారు. "మా అమ్మానాన్నల్ని పిలుచుకు రావా, ప్లీజ్ అని ప్రాధేయపడ్డాడు చిలుకను.

చిలుక ఎగురుకుంటూ వెళ్ళి పవనయ్యను వెంట పెట్టుకు వచ్చింది. పవనయ్య చక్రిని

వీపుమీద ఎక్కించుకుని ఇంటికి తీసుకు వచ్చాడు. అప్పటికే అంజనమ్మ కషాయాన్ని తయారు చేసి ఉంచింది. చక్రిగాడు రాగానే వాడి చేత వేప కషాయం తాగించింది. "వేపపుల్లను బాగా నమిలి, ఆ రసం మింగాలి. కడుపు నొప్పి తగ్గుతుంది" అని, వేపపుల్లనొకదాన్ని వాడి చేతిలో పెట్టి, వేపచెట్టు ఎక్కించింది అంజనమ్మ.

చెట్టు కింద కూర్చొని అన్న, అక్క, అమ్మ, నాన్నలు హాయిగా పండ్లు, గ్రుడ్లు తింటూ ఉంటే, చెట్టు మీద కూర్చొని చక్రిగాడు వేపపుల్లను నమలాల్సి వచ్చింది పాపం !

అయితే, బిందు అక్క చాలా మంచిది కదా, కొన్ని పండ్లను, గ్రుడ్లను చక్రిగాడి కోసం దాచి పెట్టింది. మర్నాడు వాటిని తమ్ముడికిస్తూ "తమ్ముడూ! బయటికి వెళ్ళి అన్నింటినీ పరిశీలించడం, క్రొత్త క్రొత్త విషయాలను తెలుసుకోవటం మంచిదే; కానీ పురుగులను తినడం చెడ్డ అలవాటు- అందుకే నీకు కడుపు నొప్పి వచ్చింది. చెడ్డ అలవాట్ల వల్ల కష్టాలు వస్తాయి !" అని చెప్పింది.

"ఇంకెప్పుడూ పురుగులను తిననక్కా!" అన్నాడు చక్రి, అప్పుడే బాగైన తన బొజ్జను నిమురుకుంటూ.

జోకులు

**త్రాగటం ఎందుకు?**

టీచర్ : మనం నీళ్ళు ఎందుకు త్రాగాలో చెప్పగలవా?

రవి: నీళ్ళను 'తినలేం' కాబట్టి .

**మతిమరుపు!**

రామారావు: అందరి కన్నావేగంగా తొక్కానంటున్నావు. మరి సైకిల్ రేసులో బహుమతి ఎందుకు రాలేదు?

వెంగళప్ప : తొక్కింది నిజమే . కాని స్టాండ్ తీయడం మరిచిపోయా...

*సేకరణ: సామిరెడ్డి.*



# కోతిపుండు - బ్రహ్మరాక్షసి

*రచన: శ్రీమతి రాధ మండువ*

అనగా అనగా ఒక అడవి. ఆ అడవిలో ఒక పేద్ద వేప చెట్టు. దాని మీద ఒక కోతి జంట కాపురం ఉంది.

ఒకరోజు మగ కోతి ఒక చెట్టు మీద నుండి మరో చెట్టు మీదకు దూకుతుండగా కోసుగా ఉండే కొమ్మ ఒకటి దాని కాలికి తగిలి, పాదం చీలమండ దగ్గర గీసుకుపోయింది. ఆ రోజు అది ఆ గాయం గురించి ఏమీ పట్టించుకోలేదు. మర్నాటికి గాయం సలపసాగింది.

"అబ్బ! అమ్మ!" అని మూలుగుతూ అది గద్ద దగ్గరకి వెళ్ళి "గద్ద మామా! గద్ద మామా! కాలికి గాయం అయింది. కొంచెం చూడవా!" అంది.

గద్ద గాయాన్ని తన ముక్కుతో అటూ ఇటూ కెలికి ఏదో ఆకుని కట్టింది.

మర్నాడు కోతికి నొప్పి ఎక్కువయింది.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Pillalu+Bommalu**

* * *